
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం : 28.0
కనిష్ఠం : 17.4
ANDHRAJYOTHY

సూర్యాపేట
5
శనివారం 15 నవంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587 (305.5050)	14,934	14,934
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.15 (4.36)	1,642.81	2,493.07
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.226 (43.0610)	10,544	8,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.240


రైస్‌మిల్లు వద్ద బారులు తీరిన ధాన్యం ట్రాక్టర్లు

ఎకరాకు మిగిలేది రూ. 1770

- రైతు కష్టం మిల్లర్ల సిండికేట్‌పాలు
- రూ.300 వరకు తగ్గిన ధరలు
- ట్రాక్టర్‌కు 30 కిలోల మేర తరుగు
- కూలి డబ్బులు కూడా మిగలడం లేదంటున్న రైతులు

మిల్లర్ల సిండికేట్ మాయాజాలంలో నాగార్జునసాగర్ ఆయకట్టు రైతులు దోపిడీకి గురవుతున్నారు. వానాకాలం సీజన్ ధాన్యానికి ధర తగ్గించారు. అకాల వర్షాలతో పంట దెబ్బతిన్న రైతులపై పంట ధరలు తగ్గించడం పిడుగుపాటులా మారింది. వరి కోతలు ముమ్మరం అయిన తరుణంలో 10 రోజుల నాటి ధర కన్నా రూ.300 మేర ధరలు కోత పెట్టారు. అడిగితే తాలూ, తేమ అంటూ వంకలుపెడుతున్నారు. అంతేకాకుండా ట్రాక్టర్‌కు 30 కిలోల ధాన్యం తరుగు తీస్తున్నారు. దీంతో ఎకరాకు రూ.1,770లు మాత్రమే చివరికి రైతుకు మిగిలే పరిస్థితి నెలకొంది.

- (ఆంధ్రజ్యోతి- హుజూర్‌నగర్)

సాగర్ ఆయకట్టు ప్రాంతంలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పరిధిలో వారం రోజులుగా ముమ్మరంగా వరికోతలు సాగుతున్నాయి. చింట్లు, సన్నరకాలు, హెచ్‌ఎంటీలు, బీపీటీ రకాలకు సంబంధించి పంటలు కోత మొదలుపెట్టారు. కాగా 10రోజుల కిందట క్వింటా సన్న రకాల పచ్చి ధాన్యాన్ని మిల్లర్లు రూ.2600 లకు కొనుగోలుచేయగా నాలుగు రోజులుగా రూ.2300, 2400లకే కొనుగోలుగా చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినా ఆరబెట్టి న ధాన్యం తీసుకురావాలని, తేమశాతం 17లోపే ఉండాలని నిబంధనలు విధించడంతో రైతులు పచ్చిధాన్యాన్ని విక్రయించేందుకే మొగ్గు చూపుతున్నారు. పచ్చి ధాన్యాన్ని రైతులు ఎండబెట్టుకోలేక మిల్లర్ల వద్దకు తీసుకొస్తే ఇష్టం వచ్చిన ధరలకు విక్రయించాలంటూ మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ధాన్యం బాగా లేదు, తాలు ఎక్కువగా ఉందంటూ, ధాన్యం కొనుగోలు చేయమని మిల్లర్లు తెగేసి చెబుతున్నారని, రైతులు...

- మిగతా 8వ పేజీలో...

నెల రోజులుగా నిరీక్షణ...

తిరుమలగిరి రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయి. తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామంలో సన్నధాన్యం కొనుగోలుకు ఐకేపీ కేంద్రా న్ని ఏర్పాటు చేశారు. అయితే దొడ్డు ధాన్యం తెచ్చిన రైతులను సమీపంలోని బండ్లపల్లి పీఏసీఎస్ కేంద్రంలో విక్రయించాలని సూచించారు. అయితే ఆ మేరకు తేమ శాతం చూసి 10 రోజులవుతున్నా కొనుగోళ్లు చేపట్టడం లేదు. గుండెపురి కేంద్రం నిర్వాహకులే అడ్డుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వాతావరణం ఎప్పుడు ఎలా ఉంటుందో అర్థం కావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. నెల రోజుల నుంచి ధాన్యం ఆరబోయటాని కి తెచ్చిన పట్టాల అద్దె పెరుగుతోందని, ధాన్యం రాశుల వద్ద కాపలా ఉండాల్సి వస్తోందంటున్నారు. వెంటనే కొనుగోలు చేయాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా అధికారుల మధ్య సమన్వయ లోపం రైతులకు శాపంగా మారింది. గుండెపురికి సన్న ధాన్యాం కొనుగోలు మాత్రమే అనుమతి వచ్చిందని సీసీ నాగయ్య తెలిపారు. మిగతా విషయాలేవీ తనకు తెలియదన్నారు. అయితే కొనుగోళ్లు ఎందుకు నిలిచాయంటే సమాధానం లేదు. ఈ విషయమై ఏపీఎం లక్ష్మిని...

- మిగతా 8వ పేజీలో...

ఎకరానికి సాగు ఖర్చులు	
వరి విత్తనాలు	రూ.1600
అడుగు మందు	రూ.500
దుక్కులకు	రూ.5000
వరాలు తీసేందుకు	రూ.1000
నాట్లకు	రూ.5000
అడుగు మందు	రూ.2800
3 కట్టల యూరియాకు	రూ.1500
కలుపు మందుకు	రూ.3000
పురుగుల మందుల పిచికారీకి	రూ.6000
పిచికారీ కూలీ	రూ.1000
వరి కోతలకు	రూ.10,000
ధాన్యం తరలింపునకు	రూ.2000
మొత్తం	రూ.39,400

ఒప్పందం మేరకు ధర చెల్లించాలి


నేరేడుచర్ల మండలం సాయి హనుమాన్ రైస్‌మిల్లు వద్ద ధర్నా చేస్తున్న రైతులు

నేరేడుచర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైస్‌మిల్లు నిర్మాణ సమయంలో ఒప్పందం మేరకు క్వింటాకు రూ.100 అదనంగా చెల్లించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని దిర్శించర్ల గ్రామ రైతులు గ్రామ సమీపంలోని సాయి హనుమాన్ రైస్ మిల్లు ముందు శుక్రవారం ఆందోళన చేపట్టారు. రైస్‌మిల్లు నిర్మించే సమయంలో యజమానులు రైతులతో ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. గ్రామ రైతులకు క్వింటాకు అదనంగా రూ.100, దూరంగా ఉన్న పొలాల వారికి రూ.50చెల్లిస్తామని చెప్పారన్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన బొమ్మనబోయిన గంగయ్య ట్రాక్టర్‌లో ధాన్యం తీసుకురాగా తక్కువ ధరకు చెల్లిస్తామనడం సరికాదన్నారు. మిర్యాలగూడలో రూ. 2,500 క్వింటాకు చెల్లిస్తుండగా ఇక్కడ మాత్రం రూ.2,350 చెల్లిస్తామని అనడంతో మిల్లు యజమానితో వాగ్వాదానికి దిగారు.

దీంతో రైతు గంగయ్య ధాన్యాన్ని మిల్లు గేటు వద్ద లోపలికి వాహనాలు రాకుండా అడ్డంగా పోశాడు. విషయం తెలుసుకున్న దిర్శించర్ల గ్రామరైతులు అక్కడికి చేరుకొని ఒప్పందం మేరకు ధర చెల్లించాలని ఆందోళనకు దిగారు. దీంతో మిల్లు యాజమాన్యం అనుకున్న ప్రకారం ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి అక్కడ పోసిన ధాన్యాన్ని లోపలికి తీసుకువెళ్లారు. కొంతమంది రైతులు నాణ్యత లేని ధాన్యం తీసుకువచ్చి అధిక ధర చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని, అలా అయితే రైస్‌మిల్లులు నడపడం కష్టమని మిల్లు యజమాని అనిల్ తెలిపారు.

అక్రమ వసూళ్లకు మహిళా కూలీ

6

- రోజుకు రూ.500 చెల్లింపు
- ఏసీబీ తనిఖీల్లో వెల్లడి

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


పోలీస్ సిబ్బంది సామాగ్రిని పరిశీలిస్తున్న ఎస్పీ నర్సింహ

నేరేడుచర్ల, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా చర్యలు తీసుకుంటామని ఎస్పీ నర్సింహ హెచ్చరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తారతమ్యం లేకుండా ప్రజల్లో సౌభ్రాతృత్వాన్ని పెంపొందించాలన్నారు. పకడ్బందీ సేవలతో నేరాలను అదుపు చేస్తున్నందున, గతంలో కన్నా నేరాల సంఖ్య తగ్గిందని తెలిపారు. గంజాయి రవాణా, తాగడంపై ఉక్కుపాదం మోపుతున్నామని, ఇప్పటికే అనేక మందిని పట్టుకొని కేసులు నమోదు చేశామన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తరచూ జరిగే రోడ్డు ప్రమాదాల ప్రాంతాలను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఐదు మండలాలలో సుమారు 200 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. నేరేడుచర్ల పట్టణంలో 40సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేరాలు తగ్గుముఖం పట్టేందుకు ఇళ్లు, దుకాణాల్లో కూడా యజమానులు సీసీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల ని సూచించారు. ధాన్యం సరిహద్దు దాటి అక్రమంగా రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మూసీ నది నుంచి బాలిక మృతదేహాన్ని తీసుకురావడంలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన ఎస్‌ఐ రవి కుమార్‌ను ఆయన అభినందించారు. సీసీ కెమెరాలను ప్రారంభించి పరిశీలించారు. ఆయన వెంట కోదాడ డీఎస్పీ మామిడి శ్రీధర్‌రెడ్డి, రవికుమార్, హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, ఎస్‌బీ సీఐ రామారావు, ఎస్‌ఐ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు, గురువులు దైవంతో సమానం

గరిడేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, గురువులు దైవంతో సమానమని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం గరిడేపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. దేశ మొదటి ప్రధానిగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ బాలల విద్య, వికాసం, హక్కుల కోసం ఎంతో కృషి చేసి ప్రసిద్ధి పొందారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యం వైపు దృష్టిసారించి ఆనాటి మహానుభావుల ఆశయాలను సాధించాలని అన్నారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎస్‌ఐ చలికంటి నరేష్, మండల విద్యాధికారి పానుగోతు చత్రునాయక్, పాఠశాల ఎస్‌వో శైలజ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాలబాలికలకు పోక్సో చట్టం ఎంతో కీలకం

హుజూర్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలబాలికలకు పోక్సో చట్టం ఎంతో కీలకమైందని జూనియర్ సివిల్ జడ్జి మారుతీప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంపులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ -19 ప్రకారం ప్రతి పౌరుడికి హక్కులు ఉంటాయన్నారు. వాటితో పాటు కొన్ని పరిమితులు కూడా ఉంటాయన్నారు. బాలబాలికలతో వెట్టిచాకిరీ చేయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. . కొంతమంది బాలబాలికలతో మాదక ద్రవ్యాలు రవాణా చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాని ఫలితంగా చిన్నారుల భవిష్యత్ నాశనమవుతోందన్నారు. సైబర్ నేరాలను నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కాలువ శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, బలరామిరెడ్డి, సైదాహుస్సేన్, జానీ, కేవీ సత్యనారాయణ, వేముల శ్రీనివాస్, జయమ్మ, వెంకటేశ్వరరావు, అనిత, సుశీల నగేష్‌రాథోడ్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞానార్జన

సూర్యాపేట టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో జ్ఞానం ఎంతగానో పెరుగుతుందని అదనపు కలెక్టర్ కె.సీతారామారావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ప్రతిఒక్కరూ గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగ నోటిఫికేషన్లలో విజయం సాధించి ఉద్యోగం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, కార్యదర్శి బాలమ్మ, సీతారామారావు, యానాల యాదగిరిరెడ్డి, తోటశ్యాం ప్రసాద్, శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీ రంగారావు, కె.విజయభాస్కర్, సృజన, నిర్మల, లక్ష్మమ్మ, భవాని, శ్రీను, విక్టర్ పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో ఒక్కటైన భార్యాభర్తలు

కౌన్సిలింగ్ చేసి కలిపిన జిల్లా ప్రధానన్యాయాధికారి లక్ష్మీశారద


లోక్‌అదాలత్‌లో భార్యాభర్తలకు కౌన్సిలింగ్ చేసి ఒక్కటి చేసిన జిల్లా ప్రధానన్యాయాధికారి లక్ష్మీశారద

హుజూర్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : హాయిగా సాగిపోతున్న సంసారంలో కుటుంబసమస్యలు వచ్చిపడ్డాయి. ఎవరికి వారే అన్నట్లుగా ఉన్న వారు విడిపోవాలని న్యాయస్థానం మెట్లెక్కారు. ఇద్దరు విడాకులు కావాలని న్యాయమూర్తులను ఆశ్రయించారు. న్యాయస్థానం ఇద్దరికీ ఆరు నెలల గడువు ఇచ్చింది. కోర్టు విధించిన గడువు ముగిసింది. ఇక విడాకులే అన్న తరుణంలో భార్యాభర్తలను జిల్లా న్యాయాధికారి కలిపి ఒక్కటిచేశారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన కొత్తపల్లి వెంకటేష్, అదే గ్రామానికి చెందిన శ్రీలతను 2015లో పెళ్లి చేసుకున్నారు. వారికి పాప, బాబు జన్మించారు. ఇటీవల కుటుంబంలో సమస్యలువచ్చాయి. కొత్తపల్లి వెంకటేష్ మహబూబాబాద్‌లోని పశువైద్యశాలలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భార్య శ్రీలత కూడా ఆరోగ్య శాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తోంది. ఇద్దరూ ఒకే ప్రాంతం లో ఉద్యోగాలు చేస్తున్నా వారి మధ్య సఖ్యత కొరవడి ఇటీవల విడాకులు కావాలని భర్త పిటిషన్ దాఖలుచేశారు. కాగా ఇద్దరి మధ్య దూరం పెరగడంతో ఆమె కూడా న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ కేసుకు సంబంధించి పలుమార్లు వాయిదాలు నడిచాయి. శుక్రవారం సూర్యాపేట జిల్లా ప్రధానన్యాయాధికారి బీ లక్ష్మీశారద ఆధ్వర్యంలో లోక్‌అదాలత్ నిర్వహించారు. విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్న ఇద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చారు. జీవనయానంలో ఎన్నో సమస్యలు అధిగమించాల్సి ఉంటుందని వెంకటేష్, శ్రీలతకు నచ్చజెప్పారు. ఇరువర్గాలకు సంబంధించిన కుటుంబ సభ్యులను ఒప్పించి కలిసి ఉండేలా కృషి చేశారు. కోర్టులోనే జిల్లా ప్రధానన్యాయమూర్తి వారితో దండలు మార్పించారు. కుటుంబంలో అందరు ఐక్యతగా ఉండాలని, వసుదైక కుటుంబంగా జీవించాలని సూచించారు. అనంతరం కోర్టు ఆవరణలో వెంకటేష్, శ్రీలతలతో మొక్కలు నాటించారు. విడిపోతున్న దంపతులను కలిపిన జిల్లా ప్రధానన్యాయాధికారికి న్యాయవాదులు, అక్కడికి వచ్చిన ప్రజలు, కక్షిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు జక్కుల వీరయ్య, చల్లా కృష్ణయ్య, సురేష్, తాటి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి కే నర్సింహారావు

సూర్యాపేట అర్బన్ / చివ్వెంల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పిల్లల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి, జడ్జి పర్వీన్ కౌసర్, జిల్లా సంక్షేమ అధికారి కే నర్సింహారావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కుడకుడలోని ఉన్నత పాఠశాలలో మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవంలో వారు మాట్లాడారు. సమాజంలో పిల్లల సంరక్షణ చాలా సున్నితమైన విషయమన్నారు. దీనిని బాధ్యతగా తీసుకోవాలన్నారు. అనంతరం బాలల దినోత్సవం పురస్కరించుకొని క్రీడలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి బీ రవికుమార్, సీడబ్ల్యూసీ చైర్మన్ రమణారావు, సుబ్బలక్ష్మి, శ్రీవాణి, హర్షిత, మోహన్‌రావు, అరుణ, శ్రీజా, పారిజాత, నళిని, హేమలత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు


కోదాడలో సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు

కోదాడటౌన్, నూతనకల్, అర్వపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లాలో పలు చోట్ల పలుచోట్ల సంబురాలు జరుపుకున్నారు. కోదాడలో కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు షేక్ బాగ్దాద్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. నూతనకల్ మండల కేంద్రంలో కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్‌యాదవ్ పాల్గొన్నారు. అర్వపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో గుడిపెల్లి మధుకర్ రెడ్డి, వేల్పుల రమేష్, కొత్రపిడత అవిలయ్య పాల్గొన్నారు.

గ్రామీణ కృషి అనుభవం ముఖ్యం


గ్రామ విశ్లేషణ పటం ద్వారా అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

చివ్వెంల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు గ్రామీణ స్థితిగతులపై అవగాహన ముఖ్యమని కేవీకే గడ్డిపల్లి వ్యవసాయ శాస్త్రవేత్తలు కిరణ్, నరేష్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు ప్రాంతానికి చెందిన సెయింట్ వ్యవసాయ కళాశాల విద్యార్థుల గ్రామీణ కృషి అనుభవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చివ్వెంల మండలకేంద్రాన్ని సందర్శించారు. రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయ విధానాలు, స్థితిగతులను రైతులకు వివరించారు. గ్రామస్థులతో చర్చించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటికి గ్రామపటం, చిత్రాల రూపంలో గీసి రైతులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులు మౌనిక, రమ్య, శ్రీనిజ, రోషిణి, సాగరలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏలూరుకు చెందిన వ్యవసాయ డిగ్రీ విద్యార్థినులు శుక్రవారం గడ్డిపల్లిలోని కేవీకేను సందర్శించారు. స్థానిక వ్యవసాయ విధానాలు, స్థితిగతులను తెలుసుకొని గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ చేసినట్లు గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్తలు తెలిపారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డీ ఆదర్శ్, పీ అక్షిత్‌సాయి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్‌ఫెయిర్



సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులు(ఫైల్)

సూర్యాపేట అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రతీ ఏడాది వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ మనక్ పోటీలను నిర్వహిస్తున్నారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ, రాష్ట్ర విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. విద్యార్థులు వైజ్ఞానిక, గణిత, పర్యావరణ అంశాలపై నమునాలను ప్రదర్శించనున్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో జిల్లాలో 64ప్రాజెక్ట్‌లు ఎంపికైనట్లు అధికారులు తెలిపారు.ఈనెల చివరి వారంలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

జిల్లాలో పాఠశాలలు ..

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 180, ప్రాథమికోన్నత 70, కస్తూర్బాగాంధీ విద్యా నిలయాలు 18, మోడల్ స్కూల్స్ 9, ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్స్ 12, ప్రైవేట్ పాఠశాలలు 250దాకా ఉన్నాయి.

వీటిలో ప్రతీ స్కూల్ నుంచి ఒకటినుంచి 7 ప్రాజెక్టుల వరకు వచ్చే అవకాశం ఉంటుంది. సుమారుగా జిల్లాలో 250 నుంచి 300ప్రాజెక్టులు సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శించనున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో జిల్లాస్థాయిలో ఎంపికైన ఉత్తమ నమూనాలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. ఈ మేరకు వైజ్ఞానిక ప్రదర్శన రాష్ట్ర విద్య, పరిశోధన శిక్షణ మండలి, రాష్ట్ర బాల వైజ్ఞానిక ప్రదర్శన పేరుతో నమునాలను ప్రదర్శించనున్నారు. అభివృద్ధి, స్వయం సమృద్ధి చెందే భారతదేశానికి శాస్త్ర సాంకేతిక రంగాలైన టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం అవశ్యకత అనే అంశాలతో నమూనాలను రూపొందించాల్సి ఉంటుంది. ఏడు అంశాల్లో జూనియర్ విభాగంలో 6నుంచి 8వ తరగతి వరకు, సీనియర్ విభాగంలో 9 నుంచి 12వ తరగతుల విభాగంలో ఉత్తమైన 20 ప్రాజెక్టులను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నారు.

ఏడు అంశాలల్లో ప్రదర్శనలు

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొంటారు. ఇందులో ఏడు అంశాలు ఉంటాయి. సుస్థిరవ్యవసాయం,వ్యర్థ పదార్థాల నిర్వహణ, ప్రత్యామ్నాయ మొక్కలు, హరితశక్తి, పునరుత్పాదక శక్తి, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, వినోదభరిత గణిత నమునాలు, ఆరోగ్య పరిశుభ్రత, నీటి సంరక్షణ నిర్వహణ అంశాలపై ప్రదర్శనలు ఉండనున్నాయి. ఒక్కోపాఠశాలనుంచి ఏడుగురు ఏడుప్రాజెక్ట్‌లతో మాత్రమే పాల్గొనే అవకాశం ఉంది. ఏడు ప్రాజెక్టులు వచ్చినా ఒకగ్రైడ్ టీచర్ మాత్రమే పాల్గొనాల్సి ఉంటుంది.

సైన్స్ ఫెయిర్‌లను సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. విద్యార్థులు తయారుచేసిన ప్రయోగాలను వీక్షించాలి. నూతన ఆవిష్కరణలను ప్రదర్శించే అవకాశం ప్రతీ ఒక్కరికి ఇవ్వాలి. సైన్స్ ఫెయిర్‌లను సద్వినియోగం చేసుకోవాలి.

- దేవరాజ్, జిల్లా సైన్స్ అధికారి

నలుగురిలో.. ఒకరికి



» పెరుగుతున్న మధుమేహం వ్యాధిగ్రస్తులు » జిల్లాలో ప్రతీ 100మందిలో 25 మంది మహిళలు » హార్మోన్ల వ్యత్యాసంతో పెరుగుతున్న కేసులు » ముందు జాగ్రత్తలతోనే ప్రాణాలకు రక్ష

ఆరోగ్యం లేకపోతే ఏమి ఉన్నా లేనట్టే లెక్క. మారిన ఆహారపు అలవాట్లతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇష్టాలను చంపుకోలేక జంక్ ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. ఇది ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తోంది. ఈ అలవాట్లు ఇటీవల మధుమేహం బారిన పడేస్తున్నాయి. ప్రతీ నలుగురిలో ఒకరు ఈ వ్యాధిగ్రస్తులు ఉంటున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లాలో 100మందిలో 25 మంది మహిళలు ఉండటంతో పాటు జిల్లా వ్యాప్తంగా పురుషులకంటే మహిళలే ఎక్కువగా మధుమేహ బాధితులు ఉన్నారు.

- (ఆంధ్రజ్యోతి-బీబీనగర్)

మనిషి ఆనందంగా జీవించేందుకు ప్రధాన పాత్ర పోషించే శక్తి శరీరంలో గ్లూకోజ్(చక్కెర) రూపంలో ఉంటుంది. మనం తీసుకునే ఆహారం నుంచే శరీరానికి అవసరమైన శక్తి తయారై రక్తంలో కలుస్తుంది. ఈ ప్రక్రియలో ప్రధాన పాత్ర పోషించేది ఇన్సులిన్ గ్రంధి. శరీరానికి చక్కెర ఎంత అవసరమో అది నియమిత స్థాయిలో ఉండడం అంతే అవసరం. చక్కెర శాతం రక్తంలో పెరిగిందే మనిషి జీవనయానం గాడి తప్పుతున్నట్లు లెక్క. అది మధుమేహ వ్యాధి బారిన పడేస్తుంది.

ముందస్తు లక్షణాలు

మధుమేహం బారిన పడ్డట్లు శరీరంలో వచ్చే మార్పులు సూచిస్తుంటాయి. బరువు పెరగడం, ఒక్కసారిగా బరువు తగ్గిపోవడం, ఎక్కువ ఆకలి, దాహం వేయడం, కాళ్ల తిమ్మిర్లు ఎక్కడం, తరుచూ మూత్రం రావడం, గాయాలు తగిలితే మానకపోవడం వంటివి వ్యాధి సూచనలు చెబుతున్నారు. వీటితో పాటు గుండెపోటు, పక్షవాతం వచ్చే ప్రమాదం. శరీరంలో రక్త ప్రసరణ తగ్గిపోవడం. ఇన్‌ఫెక్షన్లు చుట్టుముట్టి ఆరోగ్యాన్ని దెబ్బతీయడం, నరాలు బలహీనం, కిడ్నీ సంబంధిత వ్యాధులు రావడం, కంటి చూపు మందగించడం, పాదాలకు సంబంధించి వ్యాధులు వచ్చేఅవకాశం ఉంటుందన్నారు.

జీవనశైలిలో మార్పులే కారణం

కొన్ని ఏళ్లగా జీవనశైలిలో వచ్చిన మార్పులే ఎక్కువమంది మధుమేహ బారిన పడటానికి కారణమని నిపుణులు చెబుతున్నారు. తీసుకునే ఆహారం శరీరంలోకి వెళ్లగా గ్లూకోజ్‌ను విడుదల చేయాలి. దీనినే గ్లైసిమిక్స్ ఇండెక్స్‌గా పిలుస్తారు. ఇది ఎంత తక్కువగా ఉంటే అంత మేలు. గ్లైసిమిక్స్ ఇండెక్స్ అన్నంలో గ్లూకోజ్‌ను వేగంగా విడుదలఅవుతుంది. ఇవి కాకుండా ప్రస్తుతం మధుమేహ వ్యాధి గ్రస్తులకు ప్రత్యేక ఆహారంగా ఓట్స్ మార్కెట్‌లోకి వచ్చాయి. వీటిలో గ్లైసిమిక్స్ ఇండెక్స్ తక్కువగా ఉండడంవల్ల గ్లూకోజ్‌ను నెమ్మదిగా విడుదల చేస్తాయి. ఇలాంటి వాటిని బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకుంటే మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

మధుమేహం బారిన పడకుండా ఉండేందుకు వైద్య నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, ఒత్తిడి తక్కువగా ఉండే జీవనశైలిని అలవాటు చేసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, నిర్దీత సమయానికి తగిన మోతాదులో ఆహారం తీసుకోవడం చేయాలంటున్నారు. అదేవిధంగా ఎత్తుకు తగిన బరువు ఉండేలా జాగ్రత్తలు పాటించడం, కుటుంబంలో ఎవరికైనా వ్యాధబ ఉంటే ముందుజాగ్రత్తలు తీసుకోవడం, ఆలస్యంగా గర్భం వస్తే రక్తపరీక్షలు చేయించుకుని తేడా అనిపిస్తే వైద్యులను సంప్రదించడం శారీరకంగా బలహీనపడిన నీరసంగా ఉన్నా, నరాల నొప్పి ఉన్న తక్షణం వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.



వయసుతో సంబంధం లేకుండానే

గతంలో 40 నుంచి 50ఏళ్ల దాటిన వారిలో మాత్రమే కనిపించే మధుమేహం ఇప్పుడు అన్ని వయస్సు వారిలోనూ కనిపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. కల్తీ ఆహారానికి తోడు, ఆహారఅలవాట్లలో వచ్చిన మార్పులు, శారీరకశ్రమ లోపించడం, అధికబరువు వంటి అనేక అంశాలు చిన్న వయసులోనే మధుమేహం బారిన పడటానికి కారణమవుతున్నాయి. ప్రతీ 10సెకన్లకు ఒకరి చొప్పున ఏడాదికి 40లక్షల మంది మధుమేహం బాధితులు మృత్యువాత పడుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. 80వ దశకంలో 5శాతం మందిలో మాత్రమే కనిపించిన మధుమేహం ప్రస్తుతం 30 శాతానికి చేరుకుందని నిపుణులు చెబుతున్నారు. వచ్చే ఐదేళ్లకు ఇది 40శాతానికి చేరుకునే అవకాశం ఉందంటున్నారు.

యాదాద్రి జిల్లాలో..

యాదాద్రిభువనగిరి జిల్లాలో మధుమేహ వ్యాధిగ్రస్తులు 30,552మంది ఉన్నారు. వీరిలో మహిళలు 15,344మంది కాగా పురుషులు 15, 208మంది ఉన్నారు. ప్రతీ 100మందిలో 30 నుంచి 35మంది డయాబెటిస్ పేషెంట్లు ఉన్న ట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రికార్డులు చెబుతున్నాయి. మహిళ రోగుల సంఖ్య పెరగడాన్ని దృష్టిలో పెట్టుకుని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ డ యోబెటిస్ సొసైటీ ప్రత్యేకంగా మహిళల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపడుతోంది.

కేసులు పెరుగుతున్నాయి



కొన్నిఏళ్లగా మధుమేహ వ్యాధి బాధితులు పెరుగుతున్నారు. టైప్-2 మధుమేహ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నారు. జస్టేషనల్, డయాబెటీస్ కేసులు కూడా ఈ మధ్య ఎక్కువగా వస్తున్నాయి. ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పులు, శారీరక వ్యాయామం లేకపోవడం, అనేక కరణాలు మధుమేహానికి దారి తీస్తున్నాయి. రోజు వారీ వ్యాయామం చేస్తూ పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే మధుమేహానికి దూరంగా ఉండేందుకు అవకాశం ఉంది.

- తోట దుర్గాప్రసాద్ , ప్రభుత్వ వైద్యులు

చక్కెర శాతం పెరిగితే ఇబ్బందే



రక్తంలో చక్కెర శాతం పెరిగితే ప్రమాదకరం. ఆహార పు అలవాట్లు మార్చుకోవా లి. శారీరక శ్రమచేయాలి. అప్రమత్తంగా ఉంటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. షుగర్ రహితఆహారానికి ప్రాధాన్యమివ్వాలి. మాంసాహారానికి వీలైనంత దూరంఉండాలి. పీచు పదార్థాలు, ఓట్స్ తీసుకుంటే చాలా మంచిది.

- మౌనిక, వైద్యాధికారి, బీబీనగర్

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి: ఏఎస్పీ



మాట్లాడుతున్న ఏఎస్పీ మౌనిక

కొండమల్లేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నల్లగొండ జిల్లా దేవరకొండ ఏఎస్పీ మౌనిక అన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు ప్రాజెక్ట్ శుద్ధి కార్యక్రమంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, అనర్థాలపై శుక్రవారం మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ లక్ష్యాలు ఏర్పరుచుకొని కష్టపడి చదవాలన్నారు. క్రమశిక్షణతో కూడిన నైతిక విలువలను అలవర్చుకోవాలన్నారు. వ్యసనాల బారిన పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్, ఎంఈవో నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తెలతాడు అపహరణ



స్థానికులను విచారిస్తున్న టూటౌన్ సీఐ సోమనర్సయ్య

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం జరిగింది. బాధితురాలు, టూటౌన్ సీఐ సోమనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం బంగారుగడ్డకు చెందిన వృద్ధురాలు శిరంశెట్టి లక్ష్మి వీధిలో నడుచుకుంటూ వెళ్తోంది. ఇదే సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి వృద్ధురాలిని మాటలో పెట్టి మెడలో ఉన్న సుమారు మూడు తులాల బంగారు పుస్తెలతాడును అపహరించారు. అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ సోమనర్సయ్య తెలిపారు. చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు సంఘటన జరిగిన ప్రదేశంలోని సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

కపాస్ యాప్‌తో పరేషాన్

పత్తి విక్రయ ప్రక్రియను సులభతరం చేసేందుకు తీసుకువచ్చిన కపాస్ కిసాన్‌యాప్ రైతులను పరేషాన్ చేస్తోంది. సీసీఐలో పంట విక్రయానికి ఈ యాప్‌లో ముందుగా స్లాట్‌బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ మేరకే పత్తిని తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఒక వేళ ముందున్న వారి కొనుగోళ్లు నిలిచిపోతే వారి క్రమం వచ్చే వరకూ వేచిచూడాల్సివస్తోంది. ఈ తతంగం మొత్తంతో విసిగిపోతున్న రైతులు దళారులకు విక్రయించి నష్టపోతున్నారు.

(ఆంధ్రజ్యోతి-డిండి)

గ్రామీణ ప్రాంతాల్లో స్లాట్ ఎలా బుక్ చేసుకోవాలో తెలియని రైతులతో పాటు సెల్‌ఫోన్ కూడా లేని వారు కూడా ఉన్నారు. నూతనంగా తీసుకువచ్చిన ఈ కపాస్ కిసాన్ యాప్‌పై వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించలేదు. ఆచరణలో ఈ యాప్‌లో అనేకలోపాలు స్పష్టమవుతున్నాయి. ఈ యాప్ ద్వారా రోజుకు ఒక్క సీసీఐ కేంద్రంలో 3,300 క్వింటాళ్ల పత్తిని మాత్రమే తూకం వేసి తీసుకోవాలని నిబంధన ఉంది. స్లాట్‌బుక్ చేసుకున్న రైతు పంటను ఏకారణం వల్లనైనా కాటన్ కార్పొరేషన్ ఇండియా(సీసీఐ) కేంద్రంలో సాయత్రం 5 గంటల్లోగా తూకం వేయకపోతే మళ్లీ స్లాట్‌బుక్ చేసుకోవాల్సి వస్తోంది. తన సీరియల్ వచ్చే వరకూ ఆ కేంద్రం వద్ద రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. అప్పటివరకు అద్దెకు తెచ్చిన వాహనానికి(ట్రాక్టర్, లారీ, ఆటో) రోజుకు రూ.1000 వెయిటింగ్ చార్జీ, డ్రైవర్‌కు రూ.400 బత్తా చెల్లించాల్సి వస్తోంది. దీనికితోడు అధికారులు కొనుగోలు చేస్తారా లేదా అనే నమ్మకం లేకపోవడంతో తక్కువ ధరకు దళారీలకు విక్రయించి నష్టపోతున్నారు.

ఎకరాకు 7 క్వింటాళ్లకు పరిమితం

గత ఏడాది పత్తి ఎకరా దిగుబడి 12 క్వింటాళ్లుగా సీసీఐ నిర్ధారించింది. ఈ వానాకాలం ఎకరా పత్తి దిగుబడి 7 క్వింటాళ్లకు కుదించింది. సారవంతమైన నల్లరేగడి భూములలో 7 క్వింటాళ్లకు పైగా దిగుబడి సాధించిన రైతులూ ఉన్నారు. పరిమితికి మించి వచ్చిన దిగుబడిని ఎక్కడ విక్రయించాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీనికి తోడు ఏజిల్లా రైతులు అదేజిల్లాలో పత్తి విక్రయించాలనే నిబంధన విధించారు. దీంతో పంటను వేరేచోట విక్రయించే వెలుసుబాటులేక రైతులు ఆందోళన చెందుతున్నారు.

తప్పులతడకగా పంటల నమోదు

వ్యవసాయశాఖ అధికారులు చేసిన పంటల నమోదు తప్పుల తడకగా ఉంది. క్షేత్రస్థాయిలో పరిశీలించాక వ్యవసాయ విస్తరణ అధికారులు పంట వివరాలను నమోదు చేయాలి. కానీ రైతు సాగుచేసిన పంటకు ఏఈవోలు నమోదు చచేసిన వివరాలకు సంబంధం లేకుండా ఉంది. డిండి మండలానికి చెందిన ఓ రైతు తన రెండు ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. కానీ ఏఈవోలు ఒక ఎకరం పత్తి మరో ఎకరం వరిసాగు చేసినట్లుగా నమోదుచేశారు. దీంతో రెండు ఎకరాల్లో పండించిన పత్తిని విక్రయించడానికి ఏఈవో చేసిన తప్పు అడ్డంకిగా మారింది.

మిగిలింది అప్పులే

పత్తిసాగు చేసిన రైతులకు పెట్టుబడి రాక అప్పుల పాలవుతున్నారు. అధికవర్షాలతో దిగుబడి తగ్గి రైతులు కోలుకోలేని దెబ్బపడింది. సాగుకు చేసిన అప్పులు తీరేదారిలేక ఆందోళన నెలకొంది. నల్లగొండ డిండి మండలంలో ఈ వానాకాలం సీజన్‌లో 7వేల మంది రైతులు అధికారుల లెక్కల ప్రకారం 16,100 ఎకరాల్లో సాగు చేశారు. పంటను విక్రయించేందుకు 20 కిలోమీటర్ల దూరంలోని సీసీఐ కేంద్రానికి తీసుకువెళ్లాల్సి ఉంటుంది. ట్రాన్స్‌పోర్టు, వెయిటింగ్ చార్జీలు భరించలేక రైతులు దళారీలకు విక్రయిస్తున్నారు. రైతుల నిస్సాయతను పసిగట్టిన దళారీలు ధర ఇచ్చేందుకు కొర్రీలు పెడుతున్నారు. అటు సీసీఐ కేంద్రానికి వెళ్లలేక క్వింటా రూ.6వేలకు పత్తిని విక్రయించి నష్టపోతున్నారు.



దిగుబడిరాని పత్తిచేను

తేమ నిబంధనతో

పత్తికి ప్రభుత్వం కనీస మద్దతు ధర క్వింటాకు రూ.8,110గా నిర్ణయించింది. 8శాతంలోపు తేమ ఉన్నప్పుడు మద్దతు ధర వర్తిస్తుంది. తేమశాతం 9 ఉంటే కనీస మద్దతు ధరలో ఒక శాతం తగ్గి క్వింటాకు రూ.8,028.90 చెల్లిస్తారు. 11శాతం ఉంటే 3శాతం తగ్గించి రూ.7,866.70లు, 12 శాతం తేమ ఉంటే 4శాతం తగ్గించి రూ.7,785.60లు చెల్లిస్తారు. 12శాతం కంటే తేమ ఎక్కువ ఉన్న పత్తిని సీసీఐ అధికారులు కొనుగోలు చేయరు.

7 క్వింటాళ్ల నిబంధన సడలించాలి



ఎకరాకు 7 క్వింటాళ్ల దిగుబడి నిబంధనను సడలించాలి. అదనపు దిగుబడిని విక్రయించేందుకు రైతులు దళారీలను ఆశ్రయిస్తున్నారు. ఈ ఏడాది భారీవర్షాలతో పత్తి తడిసి తూకం తగ్గింది. కిలో పత్తి ఏరేందుకు కూలీలకు రూ.30 వరకు చెల్లిస్తున్నాం. క్వింటా పత్తి సీసీఐకేంద్రానికి తరలించేందుకు రూ.3500 ఖర్చు వస్తోంది. సీసీఐ నిబంధనలతో పత్తి రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు. ప్రభుత్వం నిబంధనలను సడలించి రైతుకు ఆర్థిక తోడ్పాటును అందించాలి.

ముత్యాల శ్యాంసుదర్‌రెడ్డి, చెర్కుపల్లి

రోడ్డు ప్రమాదంలో మేనమామ, అల్లుడు మృతి



సిరాజ్, సైదా(ఫైల్‌ఫొటోలు)

మునగాల/ కోదాడరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇరువురు చికిత్స పొందుతూ మృతి చెందారు. వరుసకు మేనమామ, అల్లుడు కాగా సూర్యాపేట జిల్లా మునగాలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడ మండలం తమ్మరకు చెందిన ఎస్‌కే సిరాజ్(32) కోదాడ మునిసిపల్ కార్యాలయంలో ప్రొక్లెయిన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామంలో ఉంటున్న మేనమామ ఎస్‌కే సైదా(35) తమ్మర దగ్గరలోని రైస్ మిల్లు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇరువురు గురువారం వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై మునగాల మండలకేంద్రానికి వెళ్లారు. తిరిగి రాత్రి 10 గంటలకు కోదాడకు వస్తుండగా ఆకుపాముల శివారు కోళ్ల ఫాం సమీపంలో వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇరువురికీ తీవ్రగాయాలు కాగా స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో కోదాడ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించి, వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తమ్మరలో విషాదఛాయలు

రోడ్డు ప్రమాదంలో గ్రామస్థులు ఇరువురి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఒకేకుటుంబానికి చెందిన ఇరువురు మృతి స్థానికులను కలచివేసింది. సిరాజ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సైదాకు భార్య, ఇరువురు కుమార్తెలున్నారు. సైదా అన్న పెద్దసైదా మూడు నెలల కిందటే బతుకుదెరువు కోసం సౌదీకి వెళ్లి అక్కడ మృతి చెందారు. ఇరువురి మృతదేహాలకు సాయంత్రం అంత్యక్రియలు పూర్తి చేశారు.

యువ పాడి రైతు ...



రమేష్(ఫైల్)

చౌటుప్పల్ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువ పాడి రైతు దుర్మరణం చెందాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ మండలం దామెర గ్రామానికి చెందిన యువ పాడిరైతు ఉప్పునూతల రమేష్(25) గురువారం సాయంత్రం పాలను తంగడపల్లిలోని పాలకేంద్రంలో పోసి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. దామెర శివారుకు రాగానే నారాయణపురం మండలం చిమిర్యాల నుంచి అజాగ్రత్త, అతివేగంతో వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలకు గురైన రమేష్‌ను స్థానిక అసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆయన తండ్రి శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తెలిపారు.

బాత్‌రూంలో కాలుజారి పడి ..



పోచయ్య(ఫైల్)

చౌటుప్పల్ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాత్‌రూంలో కాలుజారిపడి తీవ్రగాయాలకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ మండలం ధర్మాజిగూడెం గ్రామానికి చెందిన బద్రి పోచయ్య(45) ఈ నెల 13న ఇంట్లో బాత్‌రూంలో కాలు జారి తీవ్రగాయాలకు గురైయ్యాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్ అసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అన్న బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

కామెర్ల వ్యాప్తిపై పాఠశాలలో విచారణ

- సమాచారం ఇవ్వకుండా నిర్వహణపై చర్చనీయాంశం

మేళ్లచెర్వు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పాఠశాలలో పెద్దసంఖ్యలో విద్యార్థులు కామెర్ల వ్యాధిన బారినపడటంపై జిల్లా విద్యా, వైద్య, పంచాయతీ అధికారులు విచారణ నిర్వహించారు. అయితే సమాచారం ఇవ్వకుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలకేంద్రంలోని ఆరెంజ్ స్కూల్‌లో విద్యార్థులు, అధ్యాపకులు కామెర్ల బారిన పడి ఆసుపత్రిలో చికిత్సపొందడంతో పాటుగా ఆ పాఠశాల ఎల్‌కేజీ విద్యార్థి మండల కేంద్రానికి సుజిత్‌రెడ్డి(5) కామెర్లతో ఈ నెల 3న మృతి చెందాడు. స్పందించిన అధికారులు పాఠశాల ఆవరణలో 450మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించగా తాజాగా వచ్చిన రక్తనమునాల ఫలితాల ప్రకారం 80 మందికి వ్యాధి లక్షణాలు, 24 మందికి నిర్ధారణ, ఒక విద్యార్థికి ఏడు శాతం కామెర్ల లక్షణాలు ఉన్నట్లు నిర్ధారణ అయినట్లు తెలిసింది. దీంతో శుక్రవారం జిల్లా అధికారులు, స్థానిక అధికారులకు, మీడియా ప్రతినిధులకు సమాచారం అందించకుండా స్కూలు ఆవరణలో గంటసేపు దర్యాప్తు చేపట్టారు. సుజిత్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి పర్యటన వివరాలను బహిర్గతం చేయకుండానే వెనుదిరిగారు. జిల్లా అధికారులు, జిల్లా అధికారుల పర్యటన గురించి ఎంఈవో, ఎంపీడీవో వైద్యాధికారులను సంప్రదించగా తమకు సమాచారం లేదని చెప్పారు.

డెంగీతో ఉపాధ్యాయురాలు మృతి



నాగమణి(ఫైల్)

డిండి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా డిండి మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల ఉపాధ్యాయురాలు పీ.నాగమణి(35) డెంగీకి చికిత్స పొందుతూ మృతి చెందారు. కొంతకాలంగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. చందంపేట మండలం పొగిళ్ల గ్రామానికి చెందిన నాగమణి 2017 నుంచి డిండి మండలకేంద్రంలో ఉంటూ కస్తూర్బా పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. జ్వరంతో బాధపడుతున్న ఆమె ఈ నెల 12న హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్‌ఆస్పత్రిలో చికిత్సకోసం చేరారు. వ్యాధి బారిన పడి తీవ్రఅస్వస్థతకు గురై మృతి చెందారు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

లైంగికదాడికి యత్నించిన వ్యక్తిపై పోక్సో కేసు

మోటకొండూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాలికపై లైంగికదాడికి ప్రయత్నించిన వ్యక్తిపై పోక్సో, అట్రాసిటీ కేసు నమోదైన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. విశ్వసనీయ సమాచారం మేరకు మండలకేంద్రానికి చెందిన ఓ వ్యక్తి బాలిక కుటుంబసభ్యులతో స్నేహపూర్వకంగా ఉంటూ వస్తున్నాడు. ఇటీవల బాలిక ఇంట్లో గొడవ జరగ్గా అది అదునుగా తీసుకుని బాలికను రాత్రి తన ఇంటికి తీసుకెళ్లాడు. ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికపై అత్యాచారం చేయబోయాడు. అతడి నుంచి తప్పించుకుని తల్లిదండ్రుల వద్దకు వెళ్లి విషయం చెప్పడంతో వారు బాలికతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నిడమనూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం మారుపాక గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు బెజవాడ వెంకన్న గేదె ఊరు శివారులో ఓ పొలం వద్దకు మేతకు వెళ్లింది. పొలం శివారులో కేబుల్ వైరు తెగిపోయి ఉంది. గేదె ప్రమాదవశాత్తు తీగకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె విలువ రూ.లక్ష ఉంటుందని బాధితుడు తెలిపారు.

వ్యభిచారగృహంపై పోలీసుల దాడి

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వ్యభిచార గృహంపై నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. పట్టణంలోని రెడ్డికాలనీలో ఇద్దరు మహిళలు వ్యభిచార గృహాన్ని నడిపిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆ ఇంట్లో ముగ్గురు మహిళలు, ఒక విటుడు దొరికినట్లు సీఐ నాగభూషణరావు తెలిపారు. పట్టుబడ్డ వ్యక్తుల నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.1000 నదగు, ఇతర వస్తువులు స్వాధీనపర్చుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అసంపూర్తిగా టెండర్ కం బహిరంగ వేలం

కనగల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశిపురం శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద శుక్రవారం అధికారులు నిర్వహించిన టెండర్ కం బహిరంగ వేలం అసంపూర్తిగా ముగిసింది. ఆరురకాల వస్తువిక్రయ హక్కుల వేలంలో కొబ్బరికాయలకు, పూలు పండ్లకు మాత్రమే వేలం పూర్తయ్యింది. మరో నాలుగు రకాల వస్తువులకు సరైన వేలం రాక వాయిదా వేసినట్టు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుమతి తెలిపారు. లడ్డూ, పులిహోర, గాజులు, ఫంక్షన్‌హాల్ నిర్వహణ, ఫొటోలు తీసేందుకు వేలానికి సరైన పాట రానందున వాయిదా వేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఇసుక డంప్ సీజ్

వలిగొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను పోలీసులు సీజ్ చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్ఐ యుగేంధర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లింగరాజుపల్లి గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకడంప్‌లు ఉన్నట్లు సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. 30 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. బాధ్యులైన బొడిగె అశోక్, నవీన్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేరేడుచర్లలో ట్రాన్స్‌కో అధికారుల తనిఖీలు

నేరేడుచర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చౌర్యాన్ని అరికట్టడం కోసం శుక్రవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలో ట్రాన్స్‌కో విజిలెన్స్ డీఈ స్వామి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. మొత్తం 14 బృందాలుగా ఏర్పడి 613 సర్వీసులను తనిఖీ చేశారు. వాటిలో 148 సర్వీసులు అధిక లోడును ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. ఎవరైనా అక్రమంగా విద్యుత్‌ను ఉపయోగిస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో హుజూర్‌నగర్ ఏడీఈ నాగిరెడ్డి, ఇన్‌చార్జి ఏఈ పందిరి శ్రీనివాస్, పలువురు డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లకు మహిళా కూలీ

- రోజుకు రూ.500 చెల్లింపు... ఏసీబీ తనిఖీల్లో వెల్లడి
- మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.63వేలు సీజ్

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ వసూళ్లకు మహిళా కూలీని నియమించుకుని రోజుకు రూ.500 చెల్లిస్తున్నారు. ఏసీబీ అధికారుల తనిఖీలో ఈ ఆసక్తికర అంశం వెలుగుచూసింది. ఈ తనిఖీల్లో తనిఖీల్లో రూ.63,160 నగదును అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు సీజ్ చేశారు. ఏసీబీ రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లా ఏసీబీ అధికారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై సోదాలు నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు మొదలైన తనిఖీలు రాత్రి 10గంటల వరకూ కొనసాగుతున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై తాము గుర్తించిన అంశాలను నల్లగొండ ఏసీబీ డీఎస్పీ జగదీష్‌చంద్ర మీడియాకు వెల్లడించారు. మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారుల పనితీరుపై ఫిర్యాదులు రావటంతో కార్యాలయంలోని రికార్డులు, దస్తావేజులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. తనిఖీల సమయంలో కార్యాలయంలో ఆరుగురు ఉద్యోగులు ఉండగా, వారికి రెట్టింపు స్థాయిలో 12మంది డాక్యుమెంట్ రైటర్లు ఉన్నారని తెలిపారు. ఓ మహిళకు రూ.500 దినసరి కూలీ చెల్లిస్తూ అమె ద్వారా అక్రమ వసూళ్లు చేయిస్తున్నట్లుగా గుర్తించామని తెలిపారు. కార్యాలయంలో అనధికారికంగా ఉన్న రూ.63,160 నగదును సీజ్ చేశామన్నారు. తమకు లభ్యమైన నగదుకు సంబంధించిన వివరాలు వెల్లడించాలని సబ్ రిజిస్ట్రార్ బలరాంయాదవ్‌ను కోరగా ఎలాంటి సమాధానం రాలేదన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన 19డాక్యుమెంట్లను హక్కుదారులకు ఇవ్వకుండా కార్యాలయంలోనే దాచిపెట్టడాన్ని అనుమానిస్తున్నామన్నారు. అధికారుల పనితీరును పసిగట్టేందుకు ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను పనిచేయకుండా చేశారన్నారు. కార్యాలయంలో నాలుగు సీసీ కెమెరాలకు ఒక్క కెమెరా మాత్రమే పనిచేస్తోందని, అది కూడా వెయిటింగ్ కుర్చీల్లో కూర్చునే వారిని గుర్తించే విధంగా అమర్చారన్నారు. మిగతా మూడు సీసీ కెమెరాలను కావాలనే పనిచేయకుండా చేసినట్లుగా తాము గుర్తించామని తెలిపారు. మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బయటపడ్డ అక్రమాల నిగ్గు తేల్చేందుకు హైదరాబాద్‌లోని సబ్‌రిజిస్ట్రార్ సొంత ఇంట్లోనూ ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. మిర్యాలగూడ కార్యాలయంలోనూ అర్ధరాత్రి వరకు తనిఖీలు కొనసాగుతూనే ఉన్నాయి. సోదాలు పూర్తయిన అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. తనిఖీలో ఏసీబీ సీఐలు వెంకట్రావు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ సబ్‌రిజిస్ట్రార్ బలరాంయాదవ్‌ను ప్రశ్నిస్తున్న ఏసీబీ డీఎస్పీ జగదీష్‌చంద్ర

ఏడాది క్రితమే మిర్యాలగూడకు పోస్టింగ్

సబ్ రిజిస్ట్రార్ బలరాం యాదవ్ గతంలో సూర్యాపేటలో పనిచేసిన సమయంలో అవినీతి ఆరోపణలపై సస్పెన్షన్‌కు గురై ఏడాది క్రితమే మిర్యాలగూడకు పోస్టింగ్ ఇప్పించుకున్నాడు. కార్యాలయ సిబ్బందికంటే రెట్టింపుస్థాయిలో డాక్యుమెంట్ రైటర్లు, వారి అసిస్టెంట్లు కార్యాలయంలోని ప్రతి విభాగంలో పెత్తనం చెలాయించడాన్ని అధికారులు గుర్తించారు.

కళా సంపద.. కనుమరుగవుతోంది

● శిల్పుల గ్రామం కన్నెకల్ ● ఆలయాలు, కట్టడాలకు నెలవు ● కాకతీయుల అద్భుత కళావైభవం ● పర్యవేక్షణ కరువై నేడు శిథిలం

కాకతీయుల పరిపాలనలో కన్నెకల్ గ్రామం శిల్పుల గ్రామంగా వెలుగొందింది. 13వ శతాబ్దం కాలం నాటి కాకతీయుల సామంతరాజైన కుందూరు చోళులు పానగల్ రాజధానిగా పరిపాలన కొనసాగించేవారు. ఆనాటి కాలంలో కన్నెకల్‌ను కర్నెకోటగా పిలిచేవారు. కళలకు నెలవుగా ఉన్న గ్రామంలో చోళుల కాలంలో నలుపురాయి, గణపతి విగ్రహం, సప్త మాత్రుకళ, బ్రహ్మ విగ్రహాలను చెక్కించారు. నాటి అద్భుత కళా సంపద నేడు ఆదరణకు నోచుకోవడం లేదు. పర్యవేక్షణ కరువై ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న శిల్ప సంపదను పరిరక్షించాలని నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని కన్నెకల్ గ్రామస్థులు కోరుతున్నారు.

● ఆంధ్రజ్యోతి, మాడ్గులపల్లి

కాకతీయుల కాలం నాటి చక్రతీర్థ బావి, నాగుల చెరువు, అనంత పద్మనాభస్వామి దేవాలయం, కర్నెకోట, కోట గుడి నిర్మించారు. గ్రామంలో సుమారు 600 ఏళ్ల క్రితం నిర్మించిన శివాలయం కూడా ఉంది. కాకతీయుల కాలం నాటి విగ్రహాల్లో కొన్నింటిని పానగల్ మ్యూజియానికి తరలించగా మిగిలిన వాటితోపాటు పురాతన కట్టడాలు, ఆలయాలు శిథిలమై కనుమరుగవుతున్నాయి. కాకతీయుల శిల్ప సంపదను, చరిత్రను కాపాడాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం నేటి తరానికి చరిత్ర తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది. ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని చెబుతున్న రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు, చరిత్రను కాపాడకుండా కాలయాపన చేస్తున్నారని, ఆలయాలు, శిల్పసంపద కనుమరుగు అవుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో తవ్వకాలు చేపడితే ఆనాటి చరిత్రను వెలికితీస్తే భవిష్యత్ తరాలకు చరిత్ర తెలుస్తుందని చెబుతున్నారు.

బురుజులే మూల స్తంభాలు

కన్నెకల్ గ్రామం కొండగడప వెలుబండి పాలనలో ఉండేది. ఆ గ్రామం మొత్తం కోట లోపలే ఉండేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అప్పటి కోట ప్రస్తుతం ఆనవాళ్లు లేకుండా పోయింది. గ్రామానికి నలుదిక్కులా బురుజు నిర్మించి వాటికి రక్షణ గోడ కూడా నిర్మించారు. బురుజు సైతం పూర్తిగా శిథిలమవగా, ఒక్క బూర్జు నేడు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ గ్రామం నిజాం పరిపాలన కాలంలో మిర్యాలగూడ తాలూక పరిధిలో ఉండేది. ఈ పరిధిలో కన్నెకల్ గ్రామం, నారాయణపురం, గ్యారకుంటపాలెం, కేశవాపురం, మాచనపల్లి, ధర్మా పురం, గోపాలపురం ఉమ్మడి గ్రామ పంచాయతీలో ఉండేది. ప్రస్తుతం ఈ గ్రామాలను నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేశారు.



శిథిలావస్థకు చేరిన కన్నెకల్ గ్రామంలోని మల్లికార్జున దేవాలయం

పానగల్ మ్యూజియానికి కొన్ని విగ్రహాలు

గ్రామంలో ఉన్న ఆలయాల్లో విగ్రహాలు, నలుపురాయి వంటివి శిథిలావస్థకు చేరుకోవడంతో పురావస్తుశాఖ అధికారులు ముందుగానే గుర్తించారు. 40ఏళ్ల క్రితమే ఆయా విగ్రహాలను నల్లగొండ పట్టణంలోని పానగల్ సమీపంలోగల మ్యూజియంలో భద్రపరిచారు.

ప్రభుత్వం చొరవ చూపాలి



పురావస్తుశాఖ శ్రద్ధ వహించి తవ్వకాలు జరిపిస్తే శిలా సంపద దొరుకుతుంది. ప్రాచీన కాలం నాటి శిలా సంపదను కాపాడడానికి ప్రభుత్వం చొరవ చూపాలి.

● కొలనుపాక వాసుదేవరావు, పూజారి.

కంపచెట్లతో నిండిన చక్రతీర్థ బావి



కాకతీయుల కాలంలో కన్నెకల్‌లో తెల్లరాయితో నిర్మించిన చక్రతీర్థ బావికి ఒక ప్రత్యేకత ఉంది. ఆ కాలంలో అనంత పద్మనాభస్వామి స్నానానికి ఉపయోగించేవారని ప్రజల నానుడి. ఇక్కడి నుంచి దాదాపు ఎనిమిది కిలోమీటర్ల మేరా బాలాంతమ్మ ఏనె వరకు సొరంగ మార్గం ఉండేదని రాజులు యుద్ధ సమయంలో రహస్య దారిగా ఈ సొరంగ మార్గాన్ని ఉపయోగించేవారని చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఈ బావి మొత్తం 100 అడుగుల లోతు, 20 ఫీట్ల వెడల్పు, 60 ఫీట్లు పొడవుతో రెండు స్నానపు గదులు కూడా నిర్మించి ఉన్నాయి. ఈ బావి నుంచే స్వామి వారికి అభిషేక, పూజా కార్యక్రమాలకు నీరు ఉపయోగించేవారని నానుడి. ప్రస్తుతం ఆ బావి కంపచెట్లతో నిండిఉంది.

పురాతన ఆలయాలను పరిరక్షించాలి



కన్నెకల్ గ్రామంలో శిథిలావస్థకు చేరిన పురాతన ఆలయాలు, శిల్ప సంపదను పరిరక్షించాలి. చారిత్రక చిహ్నాలు కాలగర్భంలో కలిసి పోతున్నాయి. దశాబ్ద కాలం నాటి కాకతీయ వైభవం కనుమరుగు కాకుండా చూడాలి. కన్నెకల్ గ్రామంలో పురావస్తుశాఖ అధికారులు పరిశోధన చేస్తే మరికొన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

● సర్నాల నాగరాజు, కన్నెకల్ గ్రామస్థుడు

వంశాల పేరుతో వెలసిన గ్రామాలు

సుమారు 200 ఏళ్ల క్రితం 10 విశ్వ బ్రాహ్మణ కుటుంబాలు శిల్పకళ వృత్తి కోసం ఈ గ్రామానికి వలస వచ్చాయి. ఇప్పటికీ ఆయా కుటుంబాల వంశాల పేరుతో గ్రామాలు వెలసిల్లాయి. కన్నెగంటి వంశీయుల పేరుతో కన్నెకల్ గ్రామం వెలుగొందింది. అదేవిధంగా వంగాలవారి కుటుంబాలు ఎక్కువగా ఉండడంతో వంగాలవారిగూడెం, జొన్నగడ్డల గూడెం, మామిళ్లగూడెం, బోడోనిబాయి గ్రామాలు అవతరించాయి.



డిసెంబరు 5న జాతీయ సదస్సు



జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

నల్లగొండ టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 'కృత్రిమ మేధస్సు మిషన్ లెర్నింగ్- భవిష్యత్ తరాలపై విప్లవాత్మక ప్రభావం' అనే అంశంపై డిసెంబరు 5న జిల్లాకేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక రోజు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. ఉపేందర్ తెలిపారు. సదస్సు కన్వీనర్ ఎం. శ్రీనివాస్‌రెడ్డి, కో కన్వీనర్ ఎస్వీ వెంకటరమణలతో కలిసి శుక్రవారం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఏఐ/ఎంఎల్ భవిష్యత్ తరాలకు మంచి అవకాశాలు కల్పిస్తూ, పనులు సులభతరం చేసి, కొత్త ఆవిష్కరణలకు మార్గం సుగమం చేస్తుందని అన్నారు. ఈ శక్తివంతమైన సాంకేతికతను జవాబుదారీగా, నైతికంగా ఉపయోగించడం సవాలుగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, అంతటి శ్రీనివాస్, పరీక్షల నియంత్రణాధికారి మునిస్వామి, అకడమిక్ కోఆర్డినేటర్ బి. నాగరాజు, తెలుగు శాఖ అధ్యక్షుడు వెల్దండి శ్రీధర్, అధ్యాపకులు ప్రసన్నకుమార్, అనిల్ అబ్రహం, ఎ. మల్లేశం, ఎన్‌సీసీ ఆఫీసర్ సుధాకర్, జ్యోత్స్న, వెంకట్‌రెడ్డి, శివరాణి, నాగరాజు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం జీవితంలో భాగం కావాలి



విద్యార్థులతో కలిసి పాదయాత్ర చేస్తున్న జానకిరామ్‌చౌదరి

త్రిపురారం, నవంబరు 14,(ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తీ నడక, వ్యాయామం జీవితంలో భాగంగా చేసుకుంటే శారీరక, మానసిక దృఢత్వం ఏర్పడుతుందని పట్టణ ప్రముఖుడు జానకిరామ్ చౌదరి అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉపాధ్యాయుడు ధనవత్ సైదానాయక్, విద్యార్థి ధనవత్ గగన్‌నాయక్‌లతో కలిసి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్ నుంచి త్రిపురారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు 12కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. అందరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని అందుకే 72 సంవత్సరాల వయస్సులోనూ ఉత్సాహంతో పాదయాత్ర చేసినట్లు తెలిపారు. విద్యార్థి దశ నుంచే నడక, వ్యాయామం వంటి ఆరోగ్య పరిరక్షణ అలవాట్లను ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. మత్తు పానీయాలు, గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బంజార ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ నాయక్, మక్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధరల పట్టికలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు

యాదగిరిగుట్ట నవంబరు 14,(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలోని దుకాణ సముదాయాల్లో విక్రయించే వస్తువులకు సంబంధించి దుకాణం ఎదుట స్థిర ధరల పట్టికలు ఏర్పాటు చేయాలని డీఈవో దోర్బల భాస్కరశర్మ అన్నారు. యాదగిరికొండపై ప్రధాన కార్యాలయంలో శుక్రవారం వర్తకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్ణీత ధరలకు కాకుండా, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. అమలుపై దేవస్థాన అధికారులు తరుచూ తనిఖీలు నిర్వహిస్తారన్నారు. ఆక్రమణలకు పాల్పడకుండా దేవస్థానం కేటాయించిన స్థలంలోనే వర్తకం నిర్వహించాలన్నారు. అదనపు వ్యాపారం నిర్వహించడం నిబంధనల ఉల్లంఘనే అన్నారు. దేవస్థానం అనుమతించిన వ్యక్తులతోనే వర్తకం నిర్వహించే బదులు, ఇతర వ్యక్తులను నియమించడం, దుకాణాలను సబ్-లీజుకు ఇవ్వడం నిషేధమన్నారు. నిబంధనలు పాటించకుంటే జరిమానాలు, లైసెన్స్ నిలిపివేత, లీజ్ రద్దు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏఈవోలు ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, గజ్వేల్లి రఘు, జాటోత్ శంకర్‌నాయక్, ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కే. శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి కోటమైసమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు



కోటమైసమ్మ ఆలయం



నిడమనూరు, నవంబరు 14,(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని ఇండ్లకోటయ్యగూడెం గ్రామం సమీపంలో ప్రసిద్ధి చెందిన కోటమైసమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 16, 17, 18వ తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కోటమైసమ్మ అమ్మవారి విగ్రహాన్ని కార్తీకమాసంలో ప్రతిష్ఠించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచే కాకుండా గుంటూరు, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. మొదటి రోజు సుప్రభాతసేవ, గణపతిపూజ, చండీహోమం, రెండో రోజు బలిహరణం, కుంభం నైవేద్యం సమర్పణ, సర్వదర్శనం, చివరి రోజున పూర్ణాహుతి, అమ్మవారికి బోనాలు సమర్పించి, సాయంత్రం కార్తీక దీపాలంకరణ మహోత్సవం నిర్వహించనున్నారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సిరికొండ నవీన్, చైర్మన్ చౌటి ఆంజనేయులు తెలిపారు.

గుట్టలో వైభవంగా సువర్ణ పుష్పార్చన



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. .ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొల్పి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం కొనసాగాయి. సాయంత్రం అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగవ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 30,78,516 ఆదాయం సమకూరింది. కాగా, కొండకింద ఆధ్యాత్మిక వాడల్లో 929 జంటలు సత్యదేవుని వ్రతాల్లో పాల్గొన్నాయి. అదేవిధంగా కార్తీక దీపాలు వెలిగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

మట్టపల్లిలో స్తంభోద్భవుడికి విశేష అర్చనలు

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనృసింహుడి ఆలయంలో స్వామికి విశేష అర్చనలు జరిగాయి. ఆలయంలో ప్రాతఃకాలార్చనలు పూర్తయాక అర్చకులు మూలవరులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఉపాలయాల్లో పరివార దేవతలకు ప్రాబోధి నివేదనలు సమర్పించాక క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన జరిగింది. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహుడి మూర్తులను కల్యాణ వేదికపై అధిష్ఠింపజేసి విశ్వక్సేనారాధన వేదపండితులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈవో సరికొండ నవీన్ ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుందుబి దూకుడు..



శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారి 765పై పక్కన ఉన్న డిండి జలాశయం అలుగు పోస్తోంది. జలపాతాన్ని తలపిస్తున్న ఈ సుందర దృశ్యం పర్యాటకులను ఆకర్షిస్తోంది. అలుగు అందాలు చూసేందుకు శ్రీశైలం వెళ్లే యాత్రికులు ప్రాజెక్టు దిగువన ఉన్న బ్రిడ్జిపై నిలబడి ఈ దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో బంధిస్తున్నారు. ● (ఆంధ్రజ్యోతి, డిండి)

రోడ్డు పనుల్లో కాలయాపన

● సమన్వయ లోపంతో ముందుకు సాగని పనులు



కొత్తగూడెం రహదారిపై ఏర్పడిన గుంతలు

అర్వపల్లి నవంబరు 14,(ఆంధ్రజ్యోతి): మూడు జిల్లాలను కలిపే సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలంలోని తిమ్మాపురం-కోడూరు గ్రామాల మీదుగా వెళ్లే రహదారి ఏడాది నుంచి పనులు ముందుకు సాగడం లేదు. రూ.32కోట్లతో పనులు చేపట్టినా.. అధికారులు, కాంట్రాక్టర్ల సమన్వయ లోపంతో కాలయాపన జరుగుతోంది. తుంగతుర్తి మండలం సంగెం నుంచి మొదలైన పనులపై అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రంగానే ఉంది. కోడూరు గ్రామ పాలేరు వాగుపై బ్రిడ్జిని ఈ ఏడాది మే నెల వరకు పూర్తి చేయాల్సి ఉండగా నేటికీ పునాది కూడా తీయకపోవడంతో వర్షాలు కురిసినప్పుడల్లా వాగు ఉధృతంగా ప్రవహిస్తే తిమ్మాపురం, కొమ్మాల, కోడూరు, సం గెం, తుంగతుర్తి, అన్నారం గ్రామాలకు వెళ్లే రహదారి మొత్తం రాకపోకలు బంద్ అవుతున్నాయి. కోడూరు గ్రామం వర్షం వచ్చినప్పుడల్లా జలదిగ్బంధంలో ఉంటోంది. వర్షాకాలం తర్వాతే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడతామని అధికారులు చెబుతున్నారు. తిమ్మాపురం గ్రామం నుంచి ఈ రహదారి నిర్మాణం కొనసాగాలి. ఇళ్లు ఉండడంతో సర్వేచేసిన దాఖలాలు లేవు. తిమ్మాపురం గ్రామ సమీపంలో రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు మాత్రమే తొలగించారు తప్ప రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. జాజిరెడ్డిగూడెం మండలంలో బొల్లంపల్లి, వేల్పుచర్ల గ్రామాలకు వెళ్లే రహదారులు తారుకు నోచుకోలేదు. టెండర్లు పిలిచామని చెబుతున్నా అవి కాగితాలకే పరిమితమయ్యాయి. అర్వపల్లి, కాసర్లపాడు, కొమ్మాల గ్రామాలకు తారు రోడ్డు పెద్ద పెద్ద గుంతలు పడి అధ్వానంగా మారింది.

11సార్లు టెండర్లు పిలిచినా...



వాగు దాటుతున్న తిమ్మాపురం-కోడూరు గ్రామాల ప్రజలు (ఫైల్)

జాజిరెడ్డిగూడెం మండలంలో కొత్తగూడెం మారుమూల గ్రామం. 15ఏళ్ల క్రితం రూ.2కోట్లతో తారు రోడ్డు వేశారు. వేసిన సంవత్సరానికే ఇసుక లారీలు రాకపోకలు సాగించడంతో ధ్వంసమైంది. అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిపై ప్రయాణించాలంటే ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఈ రహదారి నిర్మాణానికి రూ.70లక్షలు నిధులు మంజూరయ్యాయి. 11 సార్లు టెండర్లు వేసి పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు.

తారు రోడ్ల నిర్మాణాలకు నివేదిక తయారు చేశాం

మండలంలోని గ్రామాలకు వెళ్లే రహదారులకు తార్ రోడ్ల నిర్మాణాలకు నివేదికలు తయారు చేశాం. బొల్లంపల్లి గ్రామానికి తారు రోడ్డు కోసం టెండర్లు పిలిచాం. తిమ్మాపురం-కోడూరు మధ్యలో చేపట్టే రహదారి పనులు వేగవంతం చేస్తాం.

● బాబురావు పంచాయతీరాజ్ డీఈ

వేతనాలు అందక ఆరు నెలలు


● కుంటుబపోషణ కష్టంగా గోపాలమిత్రలు ● పశుసంపద రక్షణలో కీలక పాత్ర ● ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 235 మంది గోపాలమిత్రలు



పశువులకు టీకాలు వేస్తున్న గోపాలమిత్ర(ఫైల్)

మద్దిరాల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పశుసంపద రక్షణలో కీలక పాత్ర పోషించే గోపాలమిత్రలకు వేతన వెతలు వెంటాడుతున్నాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. ఆరు నెలలుగా వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. గౌరవ వేతనంతో సేవలందిస్తుండగా నెలల తరబడి వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందించే వేతనం చెల్లించకపోవడంతో అప్పులతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని పేర్కొంటున్నారు. 2000 సంవత్సరంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ(డిస్ట్రిక్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ద్వారా గోపాల మిత్ర వ్యవస్థను ఏర్పాటు చేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గోపాలమిత్రుల పశువులకు కృత్రిమ గర్భధారణ చేయడంతో పాటు పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు ప్రథమ చికిత్స అందజేస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న నట్టల నివారణ మందులు, వ్యాక్సినేషన్, బీమా చేయించడం, పశువైద్యుల సూచనల మేరకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 235 మంది గోపాలమిత్ర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గోపాలమిత్ర సిబ్బంది నెలకు 50నుంచి 65 పశువులకు కృత్రిమ గర్భధారణ చేయాలనే టార్గెట్ ఉంటుందని చెబుతున్నారు. దీనికి రూ.40చొప్పున రైతుల నుంచి వసూలు చేసి ప్రభుత్వ ఖాతాలో జమ చేయాల్సి ఉంటుందని తెలి పారు. నిర్దేశించిన లక్ష్యాన్ని ప్రతి నెలా గోపాలమిత్రలు పూర్తి చేయాల్సిందే. లేదంటే నెల వేతనంలో కోత విధిస్తారని తెలిపారు. ప్రభుత్వం నెలకు రూ.10,050 చొప్పున గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంది. ఎనిమిది నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గోపాలమిత్ర సిబ్బంది వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

కుటుంబ పోషణ కష్టంగా మారుతోంది



వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారుతోంది. ఎనిమిది నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. చాలా ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నాం. కృత్రిమ గర్భధారణ చికిత్సకు టార్గెట్ లేకుండా చూడాలి. ప్రభుత్వం ఇప్పటికైనా వేతనాలు విడుదల చేయాలి.

● నాగెల్లి శ్రవణ్‌కుమార్, గోపాలమిత్ర, మద్దిరాల మండలం.

త్వరలో విడుదలవుతాయి

గోపాలమిత్రలకు ఆరు నెలలుగా వేతనాలు రావడం లేదు. త్వరలోనే వేతనాలు విడుదలయ్యే అవకాశముంది. .

● రాజశేఖర్, సూర్యాపేట జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి

పాఠశాలలకు పూర్వ విద్యార్థుల వితరణ

శాలిగౌరారం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందించడం అభినందనీయమని పూర్వ విద్యార్థి, నల్లగొండ ఆర్డీవో యారాల అశోక్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం మాదారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మాదారం ఉద్యోగుల గ్రూపు విరాళం ద్వారా పాఠశాల అభివృద్ధికి రూ.2లక్షల విలువైన ఉపకరణాలు అందజేశారు. స్కూల్‌కు 40 కుర్చీలు, బోర్డు, మండల పరిషత్ స్కూల్‌కు ఆడియో సిస్టమ్, 5 కుర్చీలు, ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టై, బ్యాడ్జీలు, బెల్ట్‌లు, ఐడీ కార్డులు, 5కుర్చీలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లగిశెట్టి సత్యనారాయణ, సీనియర్ సిటిజన్ పాలకుర్తి కృష్ణమూర్తి, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ కమిషనర్ చంద్రయ్య, ఎంఈవో మందుల సైదులు, సింగరేణి ఐటీ మేనేజర్ ఉండ్రాతి కృష్ణయ్య, ఉపాధ్యాయులు తంగేళ్ల వీరస్వామి, అనుమాల శ్రీనివాస్, మామిడి సైదులు ఉన్నారు.



సౌండ్ సిస్టమ్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థి, నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి

సూర్యాపేట
కోదాడ-హుజూర్‌నగర్-తుంగతుర్తి

కోరిన కోర్కెలు తీర్చే బంగారు మైసమ్మ

నేటి నుంచి మూడు రోజుల పాటు గిరిజన జాతర

మఠంపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచ్యాతండా పరిధిలోని గిరిజనుల దుప్పలగట్టు (బంగారు) మైసమ్మ జాతర నేటి నుంచి అంగరంగ వైభవంగా జరుగనుంది. ఈ జాతర కోసం ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు పూర్తి చేశారు. దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ గ్రామ దేవతకు పూజారిగా ఉన్న వందేళ్ల పానుగోతు మేయి మృతి చెందడంతో, ఆమె కోడలు మిర్యాలి ప్రస్తుతం పూజారిగా కొనసాగుతున్నారు.

మూడేళ్లకోసారి జాతర

మంచ్యాతండా దుప్పలగట్టు మైసమ్మకు ప్రతి వారం నిర్వహించే ప్రత్యేక పూజలతో పాటు ప్రతి మూడేళ్లకు జాతరను నిర్వహిస్తారు. ఈ జాతరకు కులమతాలకు అతీతంగా జిల్లా వ్యాప్తంగా భక్తులు వస్తారు. ఈ జాతరలో ముఖ్యమైన ఉత్సవం పెద్దపొలి. స్థానికులందరూ చందాలు వేసుకుని ఈ ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ జాతరకు ఒక అంబోతును గ్రామానికి దత్తత ఇవ్వడం ఒక ఆనవాయితీ.జాతరకు వచ్చే భక్తులకు అవసరమైన సదుపాయాలతో పాటు గట్టుపైకి రహదారిని నిర్మిస్తున్నారు.

నేడు చరిత్ర పారాయణంతో..

శనివారం రాత్రి 9గంటలకు చరిత్ర పారాయణంతో జాతర ప్రారంభమవుతుంది. 16న ఆదివారం ఉదయం తండాలో అమ్మవారు, దున్నపోతుల ఊరేగింపు, ఉదయం 10గంటలకు అమ్మవారికి నైవేద్యం సమర్పణ అనంతరం మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నారు. మొక్కుల అనంతరం రాత్రి సమయంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 17న గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు అనంతరం స్థానిక యువకుల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.


మంచ్యా తండాలో మైసమ్మ ఆలయం

జాతరకు రూ.20లక్షలు మంజూరు



ఈ జాతరను వైభవంగా నిర్వహించేందుకు మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.20లక్షలు మంజూరు చేయించారు. బంగారు మైసమ్మ ఆలయ అభివృద్ధిలో భాగంగా గుట్టపై రహదారి పునర్నిర్మాణం, తాగునీరు, విద్యుత్, ఆలయానికి రంగులు, విద్యుత్ అలంకణ, ఇతర మౌళిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఉత్సవ కమిటీని ఆదేశించాం.

● భూక్యా మంజూనాయక్

సిబ్బంది లేక ఇబ్బంది

కార్మిక శాఖలో ఇదీ పరిస్థితి

భానుపురి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో అధికారులు అందుబాటులో లేనందున కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. లేబర్ కార్డుల లైసెన్సులు, కొత్త కార్డులు, కొత్తకార్డుల ఆన్‌లైన్. రెన్యూవల్ కోసం మీసేవా సెంటర్లలో కార్మికులు నమోదు చేయించుకుంటున్నారు. వాటి అనుమతుల కోసం కార్మికులు కార్యాలయానికి వస్తే, సకాలంలో కార్డులు రాక రోజుల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి.

ఇన్‌చార్జీ పాలనలో అవస్థలు

లేబర్ ఆఫీసర్ మూడు జిల్లాలకు ఇన్‌చార్జి అయినందున వారానికి రెండు సార్లు మాత్రమే వస్తున్నారు. దీంతో వివిధ పనుల నిమిత్తం రోజుకు 150 నుంచి 200 మంది కార్మికులు కార్యాలయానికి వచ్చి అధికారులు లేనందున వెనక్కి వెళుతున్నారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉంది. రెండు నెలల క్రితం నల్గొండ నుంచి ఇన్‌చార్జి వచ్చి వెళ్లేవారు. ప్రస్తుతం ఇన్‌చార్జి కూడా లేనందున కార్యాలయంలో వందల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సీనియర్ అసిస్టెంట్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి .కేవలం జూనియర్ అసిస్టెంట్ మాత్రమే పని చేస్తున్నారు. కంప్యూటర్ ఆపరేటర్‌గా కాంట్రాక్టు ఉద్యోగి మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. మూడేళ్ల నుంచి జిల్లాకు రెగ్యులర్ ఆఫీసర్ లేరు. నల్గొండ జిల్లా లేబర్ ఆఫీసర్ మాత్రమే ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. బుధవారం లేబర్ ఆఫీస్‌లో జూనియర్ అసిస్టెంట్ సెలవు పెట్టడంతో కేవలం కాంట్రాక్ట్ ఉద్యోగి మాత్రమే కార్యాలయంలో ఉన్నారు.


కలెక్టరేట్‌లో ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న కార్మిక కార్యాలయం

కార్మికులకు అవగాహన కల్పించాలి



కార్మికశాఖపై కార్మికులకు అవగాహన లేదు. ఈ శాఖపై గ్రామీణ ప్రాంతాల్లో కార్మికులకు అవగాహన కల్పించాలి. లేబర్‌కార్డులు, రెన్యూవల్, లైసెన్స్ వంటి వాటి గురించి చాలా మంది కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పనికావడం లేదు.

● సీతారాములు, కార్మికుడు, సూర్యాపేట

సిబ్బంది కొరత ఉంది

సూర్యాపేటలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ లేనందున ఇబ్బంది అవుతోంది. జూనియర్ అసిస్టెంట్ పరీక్ష కోసం వెళ్లారు. కార్యాలయానికి బుధవారం వచ్చాను. కోదాడ ఫైల్స్ ఒక్కటి కూడా పెండింగ్‌లో లేవు. సూర్యాపేటవి మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. పోస్టులు భర్తీ చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

● అరుణ, ఇన్‌చార్జి లేబర్ ఆఫీసర్, సూర్యాపేట

రోడ్డు భద్రత అందరి బాధ్యత

సూర్యాపేటక్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ట్రాఫిక్ నిబంధనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రోడ్లపై 43 బ్లాక్ స్పాట్లను గుర్తించి, ప్రతి ప్రాంతంలో రోడ్డు భద్రతా కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. సూర్యాపేట డివిజన్ పరిధిలో 18 బ్లాక్ స్పాట్లను, 18గ్రామీణ రోడ్డు భద్రతా కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు వెంకటయ్య, రాజశేఖర్, ట్రాఫిక్ ఎస్ఐ. సాయిరాం, రూరల్ ఎస్ఐ బాలునాయక్, వీరన్న, సైదులు, డాక్టర్ రమేష్‌నాయక్, రోడ్డు భద్రతా కమిటీ సభ్యులు, ఐఎంఏ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భానుపురి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) సూర్యాపేట టౌన్-2లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ ఏఈ యశ్వంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

కమ్మ కులస్థులు రాజ్యాధికారం సాధించాలి


ఉసిరి చెట్టు కింద పూజల్లో పాల్గొన్న కమ్మ సంఘం ప్రతినిధులు

హుజూర్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో కమ్మ కులస్థులు సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకుని రాజ్యాధికారం సాధించాలని కమ్మ సంఘం రాష్ట్ర నాయకులు కోట సూర్యప్రకాశ్, అట్లూరి హరిబాబు కోరారు. కాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని లక్కవరం రోడ్డులోని లక్ష్మీనర్సింహారావు మామిడితోటలో కార్తీక వనభోజన మహోత్సవానిన అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడారు. నామినేటెడ్ పదవుల్లో కమ్మ కులస్థులకు ప్రాధాన్యం ఇవ్వాలని, రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. అనంతరం గణపతి, శివపార్వతులు, ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న డాక్టర్లు రావూరి శివప్రసాద్, సునీల్, రాజకీయ నాయకులు సూర్యప్రకాశ్, హరిబాబులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో శాఖమూరి రవికుమార్‌చౌదరి, కోట లక్ష్మీనర్సింహారావు, సతీష్, కోట హరిప్రసాద్, చిరుమామిళ్ళ సుధీర్, మట్టపల్లిరావు, కేఎల్ఎన్‌రావు, పెందుర్తి భాస్కర్, పి.సతీష్, ప్రసాద్, వెంకటేశ్వరరావు, బాలకృష్ణ,శ్వేత, జ్యోతి, జయప్రద, సావిత్రి పాల్గొన్నారు.

ఎకరాకు మిగిలేది రూ.1,770

(5వ పేజీ తరువాయి)

దిక్కుతోచని స్థితిలో చెప్పిన ధరకే విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు.

ట్రాక్టర్‌కు రూ.8,750 చొప్పున...

జిల్లాలో 116 రైస్‌మిల్లులు ఉండగా హుజూర్‌నగర్‌లో 22, కోదాడలో 42, తుంగతుర్తిలో 20, సూర్యాపేటలో 30 రైస్‌మిల్లులు ఉన్నట్లు అధికారులు పేర్కొంటుండగా జిల్లాలో ప్రతి మిల్లూ లక్ష క్వింటాళ్ల వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు ఆ సంఘం నాయకులు పేర్కొంటున్నారు. క్వింటాకు రూ.200 చొప్పున ధర తగ్గించడంతో ఒక్క ట్రాక్టర్ ధాన్యానికి రూ.8 వేలు నష్టపోతుండగా, 30 కిలోలు తరుగు పేరుతో తీస్తుండటంతో మరో రూ.750లు నష్టపోతున్నారు. వీటికి తోడు క్యాష్‌లెస్ పేరుతో రూ.లక్షకు రూ.1000లు తగ్గిస్తున్నారు. ఇలా అన్నిరకాలుగా మిల్లర్లు రైతు కష్టాన్ని కాజేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఎకరా సాగుకు నాట్ల నుంచి కోతలు, మిల్లుల తరలింపు వరకు రూ.39,400 ఖర్చవుతుండగా, వచ్చేది రూ.49,920 ఇందులో మిల్లర్ల కోత రూ.8,750 ఉండటంతో మిగిలేది రూ.1770లు మాత్రమేనని రైతులు వాపోతున్నారు. మూడు నెలలకు పైగా పంట సాగు కోసం కష్టపడితే కూలి కూడా గిట్టడం లేదని చెబుతున్నారు. మిల్లర్ల సిండికేట్ మాయాజాలంలో రైతులు అన్యాయానికి గురవుతున్నారని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

సిండికేట్‌గా మారడంతోనే...

హుజూర్‌నగర్ డివిజన్‌లో 1.40 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పరిధిలో 80వేల ఎకరాల్లో పంటలు చేయగా, ఆయకట్టు చివరి ప్రాంతంలోని మేళ్లచెర్వు, చింతలపాలెం, మఠంపల్లి మండలాల్లో పత్తి, మిర్చి పంటలు ఎక్కువగా సాగుచేశారు. ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పరిధిలో బోరు బావుల కింద పెద్దఎత్తున సాగు చేయడంతో ముందుగా కోతకు వచ్చాయి. ఈ దశలో రేట్లు తగ్గించడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ట్రాక్టర్ బోరెంలో సుమారు 40 క్వింటాళ్ల వరకు ధాన్యం ఉంటుంది. క్వింటా ధాన్యం క్వింటా ధర రూ.2600 నుంచి రూ.2300లకు పడిపోయింది. మిల్లర్లు సిండికేట్‌గా మారడంతో ధాన్యం ధరలు తగ్గించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతీ క్వింటాకు రూ.200 నుంచి రూ.300 వరకు తగ్గించి సన్నరకాలు కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు ప్రతీ ట్రాక్టర్‌కు 30 కిలోలు తాలు పేరుతో తరుగు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం రాగానే ధరలు తగ్గిస్తున్నారు



వానాకాలం ధాన్యం రాగానే ధరలు తగ్గిస్తున్నారు. వారం రోజుల క్రితం వరకు రూ.2600లు ఉన్న క్వింటా ధర ప్రస్తుతం రూ.2400లకే కొనుగోలుచేస్తున్నారు. తాలు, తరుగు పేరుతో ట్రాక్టర్‌కు 30 కిలోలు తీస్తున్నారు. వాతావరణం సక్రమంగా లేకపోవడంతో పచ్చిధాన్యాన్ని విక్రయించాల్సి వస్తోంది. రైతుల అవసరాలతో ధరలు తగ్గించి శ్రమ దోపిడీ చేస్తున్నారు.

● గినిరెడ్డి వెంకటరెడ్డి, రైతు పీఏసీఎస్ మాజీ చైర్మన్, హుజూర్‌నగర్

ధాన్యాన్ని బట్టి కొనుగోలు చేస్తాం



ధాన్యం మంచిగా ఉంటే ధర పెరుగుతుంది. తాలుశాతం ఎక్కువగా ఉంటే రేటు తక్కువగా ఉంటుంది. బహిరంగ మార్కెట్ ప్రకారమే మిల్లర్లు, వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేస్తారు. పచ్చిధాన్యం కాకుండా ఆరబెట్టిన ధాన్యం తెస్తే ప్రభుత్వ నిర్ణయించిన రేటు ప్రకారం ధర చెల్లించే అవకాశం ఉంటుంది. మార్కెట్‌లో బియ్యం ధరలు తగ్గడంతో ధాన్యానికి రేటు తగ్గిపోతుంది. ట్రేడర్లు ధరను నిర్ణయించరు.

● పొలిశెట్టి నర్సింహారావు, రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు

నెల రోజులుగా నిరీక్షణ..

(5వ పేజీ తరువాయి)

వివరణ కోరగా ఆయనకే తెలియాలంటూ నిట్టూరుస్తున్నారు. తాను తహసీల్దార్‌కు రిక్వెస్ట్ లెటర్ పంపించానన్నారు.

ధాన్యం తెచ్చి నెల దాటింది

కొనుగోలు కేంద్రానికి 40 రోజులు క్రితం దొడ్డు ధాన్యం తెచ్చి పోశా. 10 రోజుల క్రితం తేమశాతం చూశారు. నేటికీ కాంటాలు వేయడం లేదు. తెచ్చిన పట్టాల అద్దె పెరుగుతోంది.. వేరే పనులు చేసుకోకుండా నిత్యం కేంద్రం చుట్టే తిరుగుతున్నా. నిర్వాహకులు వెంటనే కాంటాలు వేయాలి.

● గుండెబోయిన వీరయ్య, రైతు. గుండెపురి

నేటి బాలలే రేపటి పౌరులు

నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థులు అన్ని రంగాల్లో అవగాహన పెంపొందించుకోవాలని పలువురు వక్తలు అన్నారు. జిల్లాలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలో ఆకట్టుకున్నారు. అదే విధంగా పలు పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వేషధారణలో విద్యార్థులు సందడి చేశారు. పలు పాఠశాలల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సూర్యాపేట నియోజకవర్గంలో..

సూర్యాపేట అర్బన్: జిల్లా కేంద్రంలోని జయ పాఠశాలలో విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్‌లు జెల్లాపద్మా, బింగి జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు. జీఆర్ వివేకావాణి పాఠశాలలో బాలల దినోత్సవంలో కరస్పాండెంట్ గుడిమల్ల సంతోష్‌శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● సూర్యాపేట రూరల్: సూర్యాపేటలోని ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులు భారతమాత, స్వాతంత్ర్య సమరయోధులు, వివిధ వేషధారణలతో అలరించారు. శాస్త్ర పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఆత్మకూర్(ఎస్): మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో జాటోత్ జాన్, పాల్గొన్నారు


జలాల్‌పురం ఉన్నత పాఠశాలలో జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థులు

● పెన్‌పహాడ్: మండల కేంద్రంలోని సీతారాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వాతంత్ర్య సమర యోధుల వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో..

హుజూర్‌నగర్ రూరల్: బాలల హక్కులు పరిరక్షించుకోవాలని ఎండీఆర్ విద్యా సంస్థల చైర్మన్ మేరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. ఈ పాఠశాలలో నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవంలో ఆయన మాట్లాడారు. .

● గరిడేపల్లి: మండలంలోని రంగాపురం ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాల ఎదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు కోదాడకు చెందిన విజయీభవ యాజమాన్యం మంచినీటి బాటిల్స్ బహుమతులుగా అందించినట్లు హెచ్ఎం లక్ష్మయ్య తెలిపారు.


పెన్‌పహాడ్‌లో బాలల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థినీవిద్యార్థులు

● నేరేడుచర్ల: మండల కేంద్రంలోని నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి హెచ్ఎం బట్టు మధు పూలమాలల వేసి నివాళులర్పించారు. అనంతరం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.

● మఠంపల్లి: మండలంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, సెయింట్ ఆన్స్ పాఠశాల, మాన్ ఫోర్ట్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పలు పోటీల నిర్వహించి బహుమతులు అందజేశారు.

● చింతలపాలెం: బాలల దినోత్సవం సందర్భంగా మండలంలో దొండపాడులోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు చందాలు వేసుకుని విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. ఉపాధ్యాయులను హెచ్ఎం ఉద్దోజు శ్రీనివాసాచారి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, జువారి సిమెంట్ పరిశ్రమ ప్రతినిధి ఉగేంద్ర పిళ్లై పాల్గొన్నారు. అదేవిధంగా చింతలపాలెం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ప్రసన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోదాడ నియోజకవర్గంలో..

● కోదాడ టౌన్: కోదాడలోని పించనర్ల భవనంలో ఆ సంఘం అధ్యక్షుడు వి.శ్రీనివాసరావు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


కోదాడలో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు

● కోదాడలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, గర్ల్స్ జూనియర్ కాలేజీలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి ప్రిన్సిపాల్ పుల్లూరి వెంకటనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోదాడ పట్టణంలోని తేజ పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు.

● చిలుకూరు: మండలంలోని పలు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.


తుంగతుర్తి నియోజకవర్గంలో..

తుంగతుర్తి: మండలంలోని వెంపటి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం చిత్తలూరి వెంకట్రామనర్సమ్మ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. మండల కేంద్రంలోని డీఆర్ఆర్ఎం పాఠశాలలో విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● తిరుమలగిరి రూరల్ మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలో ఆకట్టుకున్నారు. పలు పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంఈవో శాంతయ్య, హెచ్ఎంలు పాల్గొన్నారు.

● నూతనకల్: మండలంలో నిర్వహించిన బాలల దినోత్సవంలో ఎంఈవో రాములునాయక్, నోడల్ అధికారి శివయ్య, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్‌లో బాలల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



సూపరింటెండెంట్‌గా జగదీష్‌రాయుడు

ఆత్మకూర్(ఎస్): మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా జగదీష్‌రాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జనగాం జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి పదోన్నతిపై బదిలీలో ఇక్కడికి వచ్చారు.

పుల్లారెడ్డి వర్ధంతి సభను విజయవంతం చేయాలి

ఆత్మకూర్(ఎస్): హైదరాబాద్‌లో ఈ నెల 19న నిర్వహించే చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన మహాసభలో పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నల్లగొండ నాగయ్య, డేగల వెంకటకృష్ణ, కంచర్ల నర్సక్క పాల్గొన్నారు.

● కోదాడ: చంద్ర పుల్లారెడ్డి ఆశయాలను సాధించాలని సీపీఐ(ఎంఎల్) నాయకుడు ఉదయగిరి అన్నారు. పుల్లారెడ్డి 41వ వర్ధంతి సందర్భంగా పట్టణంలో లాల్ బంగ్లాలో పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వి.నర్సింహారావు, సత్యనారాయణరెడ్డి, మైసయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో సెమినార్

కోదాడ టౌన్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో కోహస్ సాఫ్ట్‌వేర్‌పై సెమినార్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతంచేయాలి

తిరుమలగిరి: ఎస్సారెస్పీ రెండో దశ కాలువకు భీంరెడ్డి నర్సింహారెడ్డి పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19వ తేదీన హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వరికుప్పల వెంకన్న కోరారు. శుక్రవారం తిరుమలగిరిలో కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు.

ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతర పోరాటం

మఠంపల్లి: ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతర పోరాటాలు చేస్తోందని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు భూక్య పాండునాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని రఘునాథపాలెం గ్రామంలో జరిగిన గ్రామశాఖ సమావేశంలో మాట్లాడారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

తిరుమలగిరి: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. శుక్రవారం తిరుమలగిరిలో సీపీఎం నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

అయ్యప్ప దేవాలయంలో అన్నదానం

కోదాడ: పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో శుక్రవారం అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చల్లా రామ్మూర్తి, కొక్కు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వామ్యం కావాలి

హుజూర్‌నగర్: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వామ్యం కావాలని మాజీ జడ్పీటీసీ గల్లా వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం పట్టణంలోని 23వ రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు పర్యావరణ రహిత సంచులను పంపిణీ చేసి మాట్లాడారు.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

హుజూర్‌నగర్ రూరల్: అంబేడ్కర్ ఆశయాలు సాధించాలని మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు దగ్గుపాటి బాబూరావు కోరారు. శుక్రవారం పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

హుజూర్‌నగర్: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు, దేవరం మల్లీశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులను ఒత్తిడికి గురిచేయొద్దు

మద్దిరాల: విద్యార్థులను చదువుల్లో ఒత్తిడికి గురిచేయొద్దని ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పోలుమళ్ల గ్రామ ప్రాథమిక పాఠశాల్లో నిర్వహించిన బాలల దినోత్సవంలో పాల్గొని ఆయన మాట్లాడారు. అనంతరం ఎంపీడీవో రెడ్డిగూడెం 'ఉపాధి' పనుల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో కాట్ల రవికుమార్, ఎస్ఐ వీరన్న, హెచ్ఎం జహీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి పవిత్రోత్సవాలు

సూర్యాపేట టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో శుక్రవారం స్వామివారి పవిత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో నల్లాన్ చక్రవర్తుల మురళీధరాచార్యులు, ఆలయ ఈవో సీహెచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు కామారెడ్డిలో బీసీల సభ

నేరేడుచర్ల: కామారెడ్డిలో ఈనెల 15న జరిగే బీసీల సభను విజయవంతం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు, ధర్మ సమాజ పార్టీ నాయకుడు అవిరెండ్ల నాగేంద్రబాబు, బీసీ జేఏసీ కన్వీనర్ బొడ్డుపల్లి సుందరయ్యలు కోరారు. శుక్రవారం నేరేడుచర్లలో సభ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు.

మధుమేహంపై ప్రజలకు అవగాహన ఉండాలి

భానుపురి: మధుమేహంపై ప్రజలకు అవగాహన ఉండాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆశ్రిత అన్నారు. శుక్రవారం సూర్యాపేటలోని గిరినగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రణీత, డిప్యూటీ డీఎంహెచ్‌వో వి. సంజీవరెడ్డి, శ్రీనివాసరాజు, వినోద్, సాంబశివరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పశు ఔషధ బ్యాంక్‌కు విరాళం

కోదాడ రూరల్: పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో నిర్వహిస్తున్న పశు ఔషధ బ్యాంక్‌కు శుక్రవారం దాతలు విరాళాలు అందజేశారు. పట్టణానికి చెందిన గట్ల శ్రీనివాసరావు రూ. 1500 విలువైన మందులను అందజేయగా, నియో స్పార్క్ కంపెనీ రూ.6వేల విలువైన ఔషధాలను విరాళంగా అందజేసినట్లు అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య తెలిపారు.

శివాలయంలో పంచామృతాభిషేకం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలోని శ్రీ పార్వతి రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, అర్చకులు దేవాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొనారు.

● చిలుకూరు:మండలంలోని నారాయణపురంలో శ్రీకనకదుర్గ అమ్మవారి దేవాలయంలో వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టి.శ్రీనివాస్, అధ్యక్షుడు టి.వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

పెన్‌పహాడ్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని ఎంపీడీవో జానయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని అనాజీపురం మోడల్ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ఆయన వెంట ఎంఈవో రవి. ప్రిన్సిపాల్ లింగయ్య, వైస్ ప్రిన్సిపాల్ గురుచరణ్, కార్యదర్శి విద్యాధర్ ఉన్నారు.

బీజేపీ సంబురాలు

చిలుకూరు: బీహార్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి భారీ విజయం సాధించడంపై మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొండ శ్రీను మాట్లాడుతూ దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా మోదీ నాయకత్వంలో బీజేపీ గెలుస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్, శ్రీనివాస్, మీసాల మార్కండేయ, బుడిగ సురేష్, మహేష్, వీరబాబు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలను కాపాడుకోవాలి

తుంగతుర్తి: గ్రామాల్లోని చెరువులు, కుంటలను కాపాడుకోవాలని తహసీల్దార్ దయానందం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ రెవెన్యూ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని చెరువులను ఎవరూ అన్యాక్రాంతం చేయకుండా చూడాల్సిన బాధ్యత గ్రామ రెవెన్యూ అధికారులపై ఉందన్నారు.

రైతు సేవా సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

తుంగతుర్తి: రైతు సేవా సహకార సంఘం అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. సహకార వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘంలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీలత, పెండెం యాదగిరి, రామచంద్రు, బిక్షంరెడ్డి, రామనర్సమ్మ, ఈదప్ప, రవీందర్‌రెడ్డి, యాదగిరి, సిబ్బంది మహేష్, ఉమేష్, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

సూర్యాపేట అర్బన్: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రైమ్ చిల్డ్రన్స్ ఆసుపత్రి డాక్టర్ మహేందర్‌రెడ్డి అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రైమ్ చిల్డ్రన్స్ ఆసుపత్రిలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలకు దగ్గు, జలుబు వారం రోజుల వరకు ఉంటుందని, తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మామిడి హర్షవర్ధన్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.